క్లుప్తంగా

బీఫార్మసీ విద్యార్థి బలవన్మరణం


ధనుష్‌కుమార్ (ఫైల్)

నాదెండ్ల: దుర్వ్యసనాలు, బెట్టింగులకు బానిసైన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులకు యిచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జె.బలరామిరెడ్డి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తూబాడు గ్రామానికి చెందిన దోగిపర్తి వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తెకు వివాహం కాగా మొదటి కుమారుడు నరేంద్రబాబు ఇంట్లోనే చిల్లర దుకాణం నడుపుతాడు. రెండో కుమారుడు ధనుష్‌కుమార్ (20) నరసరావుపేటలోని ఓ కళాశాలలో బీఫార్మసీ ఫైనలియర్ చదువుతున్నాడు. ధనుష్‌కుమార్ తన మిత్రులతో కలిసి పలువురి వద్ద అప్పులు తీసుకున్నాడు. రెండేళ్ల నుంచి అప్పులు ఇచ్చిన వారికి అధిక వడ్డీలు చెల్లిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో రెండు నెలల నుంచి వడ్డీలు చెల్లించకపోవటంతో అప్పులిచ్చిన వారు ఇంటికి వచ్చి తల్లిదండ్రులను నిలదీశారు. దీంతో మనస్తాపానికి గురైన ధనుష్‌కుమార్ శుక్రవారం ఉదయం పురుగు మందుతాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం ధనుష్‌కుమార్ మృతి చెందాడు. తండ్రి దోగిపర్తి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: భర్తతో వివాదం కారణంగా భార్య గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని శనివారం కాకాని గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కాకాని గ్రామానికి చెందిన మేడంపల్లి శ్రీదేవి (41) భర్త శేషగిరికి మధ్య గత కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలో మనస్థాపం చెందిన ఆమె గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలిని కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు రూరల్ ఎస్ఐ శివనాగిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనం ఇప్పించ లేదని యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పాతూరు ప్రాంతానికి చెందిన ఆవుల వెంకట శివసాయి ద్విచక్రవాహనం ఇప్పించాలని తండ్రితో గొడవ పడ్డాడు. వాహనం ఇప్పించక పోవటంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొన ఊపిరితో ఉన్న వెంకట శివసాయిను వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్ర బాబు తెలిపారు.

అనారోగ్య సమస్యతో వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన నాదెండ్ల హనుమంతరావు (37) శుక్రవారం నిమ్మతోటలోని అత్తగారింటికి వచ్చాడు. నాగుర్‌వలీ ట్యాకీస్ వద్ద ఉన్న ఓవర్‌బ్రిడ్జి పైకి ఎక్కి పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడిని 108 సహాయంతో వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మహాలక్ష్మీతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. టూటౌన్ సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

బస్సు ఢీకొని విద్యార్థిని మృతి


షేక్ వాజీదా (ఫైల్)

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుబ్బయ్యతోటకు చెందిన షేక్ అబ్దుల్ రషీద్ లారీ స్పైర్ షాపు నడుపుతుంటాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. రెండో కుమార్తె షేక్ వాజీదా(18) గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతుంది. శనివారం తండ్రితో కలసి ద్విచక్రవాహనంపై అడ్డరోడ్డు సెంటర్ చేరుకుంది. ఈ క్రమంలో ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అడ్డరోడ్డు సెంటర్‌లో దూసుకువచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పాటు అక్కడే బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులపైకి దూసుకు రావడంతో గుంటూరులో ఇంటర్మీడియట్ చదువుతున్న కట్టా కృష్ణ, ఏసు కుమార్ సింగ్ అనే వ్యక్తి గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన కృష్ణను గుంటూరును ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షేక్ వాజీదాను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. తండ్రి అబ్దుల్ రషీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటీలు పడి లడ్డు దక్కించుకున్నారు!

- వేర్వేరు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో లంబోదరుడికి పూజలు
- మరికొన్ని చోట్ల నిమజ్జన సంబరాలు


కొత్త చెరువుకొమ్ముపాలెంలో ఊరేగింపుగా లడ్డూను తీసుకెళ్తున్న కోటిలింగయ్య


శ్రీరాంపురం వేలంపాటలో దక్కించుకున్న లడ్డుతో సుధాకర్, కమిటీ సభ్యులు


నరసరావుపేట వేలంపాటలో మహిళల లడ్డూను దక్కించుకొన్న ఊరా లక్ష్మీసుజాత


గణపవరంలో వినాయకుని లడ్డూను వేలంలో దక్కించుకున్న భక్తులు


నల్లగార్లపాడులోని వినాయకుని విగ్రహం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం కొత్త చెరువుకొమ్ముపాలెం గ్రామంలోని వినాయక లడ్డూ వేలం పాట రికార్డు స్థాయిలో పలికింది. గ్రామంలో లడ్డూ వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన నిడమనూరి కోటిలింగయ్య రూ.2.86 లక్షలు ధరకు పాటలో లడ్డూను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోటిలింగయ్యకు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి ఘనంగా సత్కరించారు.

గంగమ్మ చెంతకు తనయుడు...

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, నల్లగార్లపాడు తదితర గ్రామాల్లో శనివారం వినాయక నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. నల్లగార్లపాడు గ్రామంలోని తూర్పు బజారులో ఏర్పాటు చేసిన పందిట్లోని గణపతి లడ్డూ ప్రసాదాన్ని భవనం నర్సిరెడ్డి వేలంలో రూ.40 వేల రూపాయలకు పాడుకున్నారు. తూర్పు బజారులో 8 ఏళ్లుగా వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపు పొడవునా ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న గణనాథుని నిమజ్జనాలు

నాదెండ్ల: వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆరో రోజు గణనాథుడు పూజలందుకున్నాడు. ఆయా ఆలయాలు, ప్రత్యేక చలువ పందిళ్లలో భక్తులు గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పలు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం వద్ద గంగానది మట్టితో రూపుదిద్దుకున్న గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డూ ప్రసాదాన్ని వేలం నిర్వహించగా, మొదటి లడ్డూను వీరవల్లి శ్రవంతి రూ.50 వేలకు, రెండో లడ్డూను కాట్రు రోశయ్య రూ.20 వేలకు దక్కించుకున్నారు. గ్రామోత్సవం అనంతరం గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులోని బుల్లెమ్మ బావి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి కెల్లంపల్లి అచ్చయ్య, సభ్యులు కెల్లంపల్లి సుందరరావు, గాలి బుచ్చయ్య, బొప్పూడి రామారావు, అయితా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని చవితి పందిర్లలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కాకుమాను బజారులోని పందిరిలో శనివారం శ్రీసిద్ధి, బుద్ధి సమేత గణనాథుని కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. దాదాపు 500 మంది మహిళలు కళ్యాణోత్సవంలో పాల్గొని గణపతి నామావళిని పఠించారు. పందిరిలో ఏర్పాటు చేసిన మహిళల 11 కేజీల లడ్డూ వేలం పాట నిర్వహించగా, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు ఊరా భాస్కరరావు సతీమణి లక్ష్మీ సుజాత రూ.43 వేలకు కైవసం చేసుకున్నారు. పాతూరులోని మద్ది రాఘవయ్య బావి వద్ద యంగ్ స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ పందిరిలోని గణనాథుడిని సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలను వైభవంగా నిర్వహించారు. ట్రస్ట్ కన్వీనర్ వనమా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. అలాగే వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన పందిర్లలోని గణనాథులను నిమజ్జనం నిమిత్తం అమరావతి వద్ద నున్న కృష్ణానదికి తరలిస్తున్నారు.

వేల్పూరులో...

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం కళామందిర్ సెంటరు వినాయక విగ్రహం వద్ద వేడుకలు గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. విగ్రహాన్ని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ వితరణ చేయగా ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేదపండితులు మారుతీశర్మ ఆధ్వర్యంలో దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించుతున్నారు. శనివారం మండలంలోని బొందిలి పాలెం గ్రామ మహిళలచే కోలాటం కార్యక్రమంగా ప్రత్యేకంగా భక్తులకు అలపించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు. 10వరోజు భారీ అన్నదానం అనంతరం 11వ రోజు విగ్రహం నిమజ్జనం కార్యక్రమాలు వైభవంగా చేస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు. అలాగే స్థానిక గ్రంథాలయం వీధిలో వినాయక విగ్రహం నిమజ్జనం వేడుకలు కమిటీ సభ్యులు శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సనిశెట్టి వెంకట గురువీరాంజినేయులు-లీలావతి దంపతులు విగ్రహాన్ని వితరణ చేశారు. స్వామి వారి లడ్డూను జవ్వాజి అంజయ్య రూ.20 వేల 500 రూపాయలకు దక్కించుకున్నారు. విగ్రహం నిమజ్జనం వేడుకల్లో భాగంగా మేళతాళాలు కనకతప్పట్లు నడుము విగ్రహాన్ని విద్యుత్ కాంతులతో ఘనంగా ఊరేగించారు.

ఈకార్యక్రమంలో గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో..

నరసరావుపేట: పట్టణంలోని శ్రీరాంపురంలో వినాయక చవితి సందర్భంగా మెడికల్ అసోసియేషన్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన చవితి పందిరిలోని శ్రీ వినాయకునికి ప్రసాదంగా సమర్పించిన రెండు లడ్డులకు శనివారం రాత్రి వేలం నిర్వహించారు. 45 కేజీల పెద్దలడ్డును తిరువీధుల సుధాకర్ రూ.1.53 లక్షలకు పాడి దక్కించుకోగా, 13 కేజీల మహిళల లడ్డును చిలకల కోటేశ్వరరావు మిత్రబృందం రూ.49 వేలకు పాడి దక్కించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కమిటీ సభ్యులు చేగు వెంకటేశ్వరరావు, ఎస్.సురేంద్ర, ప్రవల్లికా సత్యం, కేపీ రంగారావు, కె.బదరీనారాయణ, చిలకల శ్రీరామమూర్తి పర్యవేక్షించారు.

ఇకపై పంచాయతీల్లో నగదు లావాదేవీల్లేవు

- ఎంపీడీవో వై హనుమారెడ్డి
- పంచాయతీ ఇ-పేమెంట్‌పై అవగాహన
- కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ


ఇ-పేమెంట్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

యడ్లపాడు: ఇకపై గ్రామ పంచాయతీలకు వచ్చే రాబడులను డిజిటల్ విధానంతో చెల్లించాలని ఎంపీడీవో వై హనుమారెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ ఇ-పేమెంట్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యాకలాపాలన్నీ ఆన్‌లైన్ చేసిన విధంగానే వాటికి వచ్చే ఆదాయ, వ్యయాలను కూడా పూర్తిస్థాయిలో ప్రభుత్వం డిజిటలైజేషన్ చేసిందన్నారు. కాబట్టి గ్రామీణ ప్రాంత ప్రజలు పంచాయతీలకు చెల్లించే ఆస్తిపన్ను, నీటిపన్ను, వివిధ సర్టిఫికెట్ల కోసం చెల్లించాల్సిన మొత్తాన్ని నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ ద్వారా ఇ- పేమెంట్ చేయాలన్నారు. అనంతరం యడ్లపాడు పంచాయతీ కార్యదర్శి ఎ.శశికళ, తిమ్మాపురం డిజిటల్ అసిస్టెంట్ పూర్ణసాయి ఇ-పేమెంట్ లావాదేవీలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 18 కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాకు హాజరయ్యారు. 270 మంది అభ్యర్థులు పాల్గొనగా 119 మందిని కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేశాయి. జాబ్‌మేళా ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నైపుణ్యాభివృద్ధి సంస్థ పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలో సంస్థ ఆధ్వర్యంలో 29 క్యాంపులు నిర్వహించారని తెలిపారు. అయా క్యాంప్‌ల్లో 8400 మంది పాల్గొనగా 4400 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. మూడు నెలలకు ఒకసారి ప్రతి నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వివిధ కారణాలతో ఉద్యోగాలను కొంతకాలానికే వదిలివేస్తున్నారని తెలిపారు. ఉద్యోగ అవకాశాన్ని అనుభవంగా భావించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నైపుణ్యాభివృద్ధి సంస్థలో మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. యువతలో నైపుణ్యాలను అభివృద్ధి పరిచేందుకు ప్రతి నియోజకవర్గంలో స్కిల్ ల్యాబ్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. యువతీ, యువకులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, డీఎల్‌డీఓ వెంకటరెడ్డి, ఎస్ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి యం.రవీంద్రనాయక్, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ వీరాంజనేయులు, రమ్య, కృపానందంలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- చేసినా, ప్రోత్సహించినా జైలు, జరిమానా తప్పదు
- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి
- యడ్లపాడు-2 గ్రామ సచివాలయం సందర్శన


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పద్మావతి, ఎంపీడీవో హనుమారెడ్డి

యడ్లపాడు: బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా.. జైలుశిక్ష, జరిమానా తప్పదని బాలల హక్కుల కమిటీ సభ్యురాలు బత్తులు పద్మావతి సూచించారు. మండల కేంద్రమైన యడ్లపాడు-2 గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వై హనుమారెడ్డి, సీడీపీవో జి.శాంతకుమారితో కలిసి శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయాల నుంచి బాలల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలపై చేస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాలకు నిరక్షరాస్యతతో పాటు లింగవివక్ష ప్రధాన కారణమన్నారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్య వివాహాల కారణంగా కలిగే అనర్థాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చదివే వయసులో బలవంతంగా జరిగే ఈ వివాహాల కారణంగా బాలికల పలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. వారికి పుట్టే బిడ్డలు కూడా మానసిక, శారీరక పరిపక్వత ఉండదని వివరించారు. తద్వారా వారి బంగారు భవిష్యత్‌ను అంధకారంగా మార్చుతున్నారన్న విషయాన్ని బాలిక తల్లిదండ్రులు, సంరక్షకులే గ్రహించాలన్నారు. బాల్య వివాహాలు చేసేవారిపై అధికారులు కఠినంగా వ్యవహరించి, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇందుకోసం ఐసీడీఎస్, విద్య, పోలీసు, గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ అధికారులు సమిష్టిగా బాల్య వివాహాల్ని గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల సహకారంతో అడ్డుకోవాలన్నారు. బాల్య వివాహాల నిరోధం, వారి హక్కుల సంరక్షణపై ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి సచివాలయంలోనూ చైల్డ్‌లైన్లకు సంబంధించిన ఆయా అధికారుల సెల్‌నంబర్లను పోస్టర్లపై ప్రదర్శించ చేయాలన్నారు. వీటిపై ఎంపీడీవో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్రమ బాలల తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బాలల రక్షణ, సంరక్షణ, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అంతటా చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు ఏర్పాటు చేసిందన్నారు. బాలల హక్కుల పరిరక్షణలతో దేశంలోనే ఏపీ ఐదోస్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో బి.నిర్మలారాణి తదితరులు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి శశికళా ఉన్నారు.

తెలుగు మాటపై సాహిత్య మేళ


సాహిత్య మేళలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో శనివారం నెల నెల సాహిత్య మేళ నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్య సమాలోచన కార్యక్రమంలో భాగంగా తెలుగు జాతీయాలు, సామెతలుపై సాహితీ గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని తెలుగు నుడికారంపై మాట్లాడారు. తెలుగు మాటల పుట్టుక, అభివృద్ధి అంశాలను వివరించారు. పాఠశాలల విద్యార్థులు తెలుగు మాటల సమాహారాన్ని వివరించి కలెక్టర్ శివశంకర్ అభినందనలు పొందారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై బాలికలు అవగాహన పెంచుకోవాలి


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు

నరసరావుపేట రూరల్: బాలికలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు సూచించారు. మండలంలోని ఉప్పలపాడు వైఎస్ఆర్ అండ్ వైవీఆర్ హైస్కూల్‌లో శనివారం బాల్యవివాహాలు, గర్భాశయ, రక్త కణి క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సౌజన్యంతో యశోద క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొని అవగాహన కల్పించారు. సమాజంలో ఎక్కువ మంది మహిళలు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు, కారణాలను విద్యార్థులకు వివరించారు. వ్యాధి బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేసారు. అలాగే బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఏఏ మధుకుమార్, డి.వీరారెడ్డి, రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిసలు కావద్దు

చిలకలూరిపేటటౌన్: యువత వ్యసనాలకు బానిసై తమ భావిజీవితాన్ని నాశనం చేసుకోవద్దని డాక్టర్ సయ్యద్ అహమ్మద్ బాష చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వాసవి గ్రాండ్ పంక్షన్ హాలులో సేవ్‌ది యూత్- సేవ్‌ది ఫ్యూచర్ అనే అంశంపై విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ అహమ్మద్ బాష మాట్లాడుతూ సోషల్ మీడియాతో విద్యార్థులు ఎక్కువ సమయం గడుపుతున్నారని, ఇందువల్ల వాస్తవ ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ స్వామి వివేకానంద చెప్పిన మాటలను ఉటంకిస్తూ ఉక్కులాంటి నరాలు, వజ్రం లాంటి సంకల్పం కలిగిన యువత మన దేశానికి ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు బలమైన సంకల్పంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అడ్వైజరీ కమిటీ సభ్యులు మానం శ్రీనివాసరావు, మెడరన్ విద్యాసంస్థల అధినేత చేబ్రోలు మహేష్, సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రపుల్లాదేవి, డాక్టర్ అశ్విని, డాక్టర్ ఇందిరా, సంధ్య, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో డిజిటల్ చెల్లింపులు చేయాలి

ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్


మాట్లాడుతున్న ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, పక్కనే తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

నాదెండ్ల: గ్రామ సచివాలయాలకు చెల్లించే పన్నులు డిజిటల్ రూపంలో పీవోఎస్ విధానంలో జరపాలని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పా రు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంచాయతీలకు ప్రజలు చెల్లించే ఏ పన్ను అయినా సరే ఇక నుంచి డిజిటల్ రూపంలోనే చెల్లించాలన్నారు. ప్రతి చెల్లింపుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని సూచించారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, గతంలో పొలం కొనుగోలు, అమ్మకాలు జరిపిన రైతులు తప్పనిసరిగా రెవిన్యూ రికార్డుల్లో మార్పులు చేయించుకోవాలన్నారు. పాసు పుస్తకం కావలసిన వారు వీఆర్వోల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రీసర్వే కొన్ని గ్రామాల్లో జరుగుతున్నందున అభ్యంతరాలు ఉన్నట్లయితే సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

బొల్లాపల్లి: నేడు మండలంలో రావులాపురం, గండిగనుమల గ్రామ సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా శనివారం తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. వైఎస్సార్ జలకళ బోర్లు, తాగునీటి సమస్య కొరత లేకుండా ఉండేందుకు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు

బొల్లాపల్లి: మండలంలో 3 అంగన్‌వాడీ కేంద్రాలు నూతన భవనాల నిర్మాణాలు త్వరలో పూర్తికానున్నాయి. ఒక్కొక్క బిల్డింగ్ నిర్మాణానికి రూ.16 వేల 500 మంజూరైనట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. రేమిడిచర్ల, వివి చెంచు కాలనీల్లో భవన నిర్మాణం పూర్తయిందన్నారు. గుమ్మనంపాడులో స్లాబు వేశామని, త్వరలో పూర్తి చేస్తామని ఈ మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. శ్రీదేవి తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్ రాంబాబు చెప్పారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలను 9959225427 ఫోన్‌కు సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోవా మద్యం స్వాధీనం



ఈపూరు : రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నవారిపాలెంలో 768 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ రాఘవేంద్రరావు శనివారం తెలిపారు. సమాచారం మేరకు ఈపూరు ఎస్‌ఈబీ ఎస్ఐ వీరవల్లి సైమన్ తన సిబ్బందితో దాడులు చేయగా 52 కేసుల 750 ఎంఎల్ హనీ గ్రేడ్ బ్రాందీ, 2 కేసుల రాయల్ క్లాసిక్ మాల్ట్ విస్కీ, ఒక కేసు మెన్షన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాందీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బుచ్చిపాపన్నవారిపాలెంకు చెందిన చల్లా వెంకటసాయి, ముత్తనపల్లికి చెందిన గోరంట్ల లక్ష్మీనారాయణ, తంగెడుమల్లి గ్రామానికి చెందిన అద్దంకి విజయ్‌కుమార్, బాపట్ల జిల్లా జానకవరంకు చెందిన కొండేపి రాములు గోవా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. మొత్తం 768 బాటిళ్లను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేశామని, వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాల విద్యా కమిషన్ సభ్యుడు వరప్రసాద్‌కు నివాళి

వినుకొండ(నూజెండ్ల) : పాఠశాల విద్యాశాఖ విద్యా కమిషన్ సభ్యులు, వినుకొండ వాసి చిలకల ఆశీర్వాద వరప్రసాద్ (72) అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో విద్యాశాఖ అధికారిగా, ఆర్‌జేడీగా, పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్‌గా దాదాపు 35 సంవత్సరాలు విద్యారంగంలో విశిష్ట సేవలు అందించారు. వీరి సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ విద్యాకమిషన్ సభ్యులుగా నియమించింది. ఆయన రాష్ట్రంలో విద్యాభివృద్ధికి విశేషకృషి చేశారని పలువురు కొనియాడారు. ఆశీర్వాద వరప్రసాద్‌కు పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది పి.జె.లూకా, చాట్ల రామయ్య, పాస్టర్ పి.ఫిలిప్, సురభి జోసెఫ్, కుటుంబసభ్యులు చిలకల జాన్‌సుందరరావు, చిలకల కృపాకరరావు తదితరులు నివాళులర్పించారు.

ప్రాథమిక దశలోనే అవగాహన ఏర్పరచుకోవాలి

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు అవినీతి అక్రమలు తదితర వాటిని నియంత్రణ దిశగా పూర్తిస్థాయిలో అవగాహన కల్గియుండాలని ప్రకాశం గుంటూరు, నెల్లూరు మూడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటరు గోనెల్ల మాధవశంకర్ అన్నారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, సొసైటీ డైరెక్టర్లు మద్దికుంట ఏడుకొండలు, ఓంగోలు హను మంతరావు, సొసైటీ సీఈవోలు జాలాది నాగప్రసావు, పోకా కోటేశ్వరరావు, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.